క్లుప్తంగా

నియామకం..


పూర్ణచంద్రరావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ప్రాంతీయ అధ్యాయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చీపు పూర్ణచంద్రరరావును నియమిస్తూ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కళాశాల ప్రిన్సిపల్ గోపి హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ లేదా ఐటీఐ డిప్లమాలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు.. డిగ్రీలో చేరడానికి, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర ట్యూషన్‌ఫీజు చెల్లించడానికి ఈ నెల 30వరకు గడువు ఉందన్నారు.

మంత్రి తుమ్మల పరామర్శ..


గాదె సత్యనారాయణను పరామర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న సత్తుపల్లికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ గాదె సత్యనారాయణను ఆయన నివాసంలో ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన చీకటి ధర్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, చల్లగుళ్ల నర్సింహారావు, వెల్ది జగన్మోహన్‌రావు, దోమా ఆనంద్, గాదె చెన్నారావు, ఎండి కమల్‌పాషా, పువ్వాళ్ల ఉమా, రామ్మోహన్‌రెడ్డి, మేకా సతీష్‌రెడ్డి, పి.శ్రీనివాసరావు, టోపి శ్రీను, ద్రోణవల్లి గోపి, కిలారి వెంకటేశ్వరరావు, మారుతి బాబురావు, కొల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్వనాథపల్లిలో అట్లతద్ది వేడుకలు


ఉయ్యాల ఊగుతున్న మహిళలు

కారేపల్లి: మహిళలు మాత్రమే జరుపుకునే అతి ముఖ్యమైన పండుగల్లో అట్లతద్ది ఒకటి. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో అట్లతద్ది వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు గౌరీదేవికి ప్రత్యేక పూజలు చేసి అట్లను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం వాయనాలను ఇచ్చి పుచ్చుకున్నారు. ఉయ్యాలలు ఊగి సందడి చేయగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొన్నది.

హక్కుల కోసం పోరాడిన మేధావి సాయిబాబా


ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: ఆదివాసీలు, కార్మికులు అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహామేధావి ప్రొఫెసర్ సాయిబాబా అని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల డివిజన్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఆర్‌వీ కుమార్, ఎల్‌ఎస్‌రెడ్డి, గడ్డం శ్రీనివాసరావు, నజీరుద్దీన్, దుర్గారావు, జి.వి.రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

మధిర: మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఈ నెల 21న మధిర పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.బ్రహ్మారెడ్డి తెలిపారు. ఆదివారం మధిరలో జరిగిన సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు.

ఈ సమావేశంలో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, సుధాకర్, మదన్‌మోహన్‌రెడ్డి, బాలకృష్ణ, రామ్మోహన్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌కు ‘అనుబంధ’మేది..?

- కల్లూరు రెవెన్యూ డివిజన్ ఏర్పడి ఎనిమిదేళ్లు..
- కానరాని అనుబంధ కార్యాలయాలు
- దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అసంతృప్తితో కల్లూరుప్రాంత ప్రజలు


కల్లూరు ఆర్డీఓ కార్యాలయం

కల్లూరు: ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కల్లూరు రెవెన్యూ డివిజన్ ఏర్పడింది. డివిజన్ ఏర్పడి ఎనిమిదేళ్లయినా.. దాని అనుబంధ కార్యాలయాలు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడి ప్రజలకు అసౌకర్యంగా ఉంటుంది. ఇదిలా ఉండగా.. ఇప్పటి వరకు ఒక్క కార్యాలయం రాకపోగా ఉన్న పశుసంవర్ధకశాఖ ఏడీ కార్యాలయాన్ని, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలను సత్తుపల్లికి తరలించారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చొరవతో జలవనరుల సీఈ కార్యాలయం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో పాటు ఈ ప్రాంతానికి చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు దృష్టి సారిస్తే.. కల్లూరు రెవెన్యూ డివిజన్‌కు అన్ని కార్యాలయాలు వస్తాయని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

50 రోజుల పోరాటం..

కల్లూరులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని అన్ని పార్టీల నాయకులు, ప్రజలు 50 రోజుల పాటు పోరాటం చేశారు. ప్రభుత్వం స్పందించి కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా పాల్వంచలో ఉన్న ఆర్డీఓను 2016 అక్టోబర్ నెలలో కల్లూరుకు తరలించారు. దీని ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఆర్డీఓ అనుబంధ కార్యాలయాలను ఎన్నెస్పీలోని ఖాళీస్థలంలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అప్పటి నుంచి ఆ హామీ ఇప్పటికీ అలాగే ఉంది. ట్రెజరీ కార్యాలయం కల్లూరుకు మంజూరు కాగా ఇక్కడ భవన వసతి లేదని వైరా తరలించారు.

నిలిచిపోయిన ఏసీపీ కార్యాలయం..

డివిజన్ కార్యాలయానికి అనుబంధంగా ఐదేళ్లకిందట ఎన్నెస్పీలో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న ఏసీపీ కార్యాలయ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. అసైన్డ్ భూమి తమకు ప్రభుత్వం పట్టా ఇచ్చిందని లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించగా కోర్టు స్టే ఇవ్వడంతో నిర్మాణం నిలిచిపోయింది. దీంతో పాటు రూ.63 లక్షలతో నిర్మిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం, రూ. 1.83 కోట్లతో నిర్మిస్తున్న 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాము నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ కార్యాలయాలతో పాటు ఎక్సైజ్, ఫైర్ స్టేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, సీటీఓ, పశు సంవర్ధకశాఖ ఏడీ కార్యాలయం తదితర శాఖలు రావాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కల్లూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి అనుబంధ కార్యాలయాలు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పోరాటం చేసి సాధించుకున్నాం..



రెవెన్యూ డివిజన్ కోసం కల్లూరులో రాజకీయాలకు అతీతంగా 2016లో ఆందోళన చేసాం. అనుబంధ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రెవెన్యూ డివిజన్ ఏర్పడి ఎనిమిదేళ్లయినా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.

– జాస్తి శ్రీనివాసరావు, రెవెన్యూ డివిజన్ పోరాట జేఏసీ నాయకుడు, కల్లూరు

భవన నిర్మాణాలకు స్థలం ఉంది..



కల్లూరు ఆర్డీఓ కార్యాలయానికి అనుబంధ కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఎన్నెస్పీలో కావాల్సినంత స్థలం ఉంది. అనుబంధ కార్యాలయాలు తక్షణమే ఏర్పాటు చేయాలి. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయిలు జోక్యం చేసుకుని అనుబంధ కార్యాలయాలు కల్లూరుకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలి.

– గుసుకుల ఈశ్వరరావు, కల్లూరు

ప్రతిపాదనలు సిద్ధం చేయండి


సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. ఆదివారం వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి దాదాపు రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ తల్లాడ మండల కమిటీ ఎన్నిక


తల్లాడ మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులుగా లాల్ సయ్యద్, శ్రీనివాసరావు

తల్లాడ: యూటీఎఫ్ తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా షేక్ లాల్ సయ్యద్, తాళ్లూరి శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం యూటీఎఫ్ తల్లాడ మండల మహాసభ ఖమ్మం యూటీఎఫ్ భవనంలో.. జిల్లా అధ్యక్షుడే నాగమల్లేశ్వరరావు సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వపు జిల్లా కార్యదర్శి వీరబాబు, జిల్లా కార్యదర్శి రంజాన్, కె.శ్రీకాంత్, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

కమలమ్మకు నివాళి..

ముదిగొండ: మండలపరిధిలోని వెంకటాపురంలో రాయల వెంకటేశ్వర్లు సతీమణి, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాతృమూర్తి రాయల కమలమ్మ 4వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్‌బాబు, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేసు నమోదు

ముదిగొండ: మండల పరిధిలోని వనంవారి కిష్టాపురం గ్రామానికి చెందిన బుడిగ బాబు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన విదితమే. మృతుని భార్య మాధవి ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ


పడిపూజకు హాజరైన భక్తులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లిటౌన్: స్వామియే అయ్యప్పో.. స్వామి శరణం అయ్యప్పశరణం.. జైజై మాత.. దుర్గామాతా.. అంటూ అయ్యప్పభక్తులు, భవాని మాలధారణ భక్తుల నామస్మరణలతో సత్తుపల్లిలోని రాజీవ్‌నగర్ మార్మోగింది. శ్రీవిజయదుర్గ అయ్యప్ప దేవాలయం 9వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శనివారం అర్ధరాత్రి హరిశ్చంద్రగురుస్వామి ఆధ్వర్యాన అయ్యప్ప పడిపూజ, తాటిపర్తి వీరబ్రహ్మాచారి గురుస్వామి ఆధ్వర్యాన శ్రీ విజయదుర్గా అమ్మవారి పడిపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు చల్లగుళ్ల నర్సింహారావు, వెంకటరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, సూరిశెట్టి పాపారావు, సత్తుపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు వెయ్యిమంది అయ్యప్ప, భవాని మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

కొణిజర్ల: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం కొణిజర్లలో మోత్కూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, తాళ్లపల్లి కృష్ణ, కొప్పుల కృష్ణయ్య, నాయకులు కుటుంబరావు, శ్రీనివాసరావు, కృష్ణార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


దుర్గాభవాని


జయశ్రీ


మహాలక్ష్మి

మధిర: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఖో–ఖో పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థిని దుర్గాభవాని, మాటూరు జెడ్పీ పాఠశాల విద్యార్థినులు మేడిశెట్టి మహాలక్ష్మి, చిలువేరు జయశ్రీలు ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు బి.అంజన్‌బాబు, చెరుపల్లి శ్రీహరి, పీడీ సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బీసీ గురుకుల విద్యార్థులు..


కొణిజర్ల: పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కొణిజర్ల: ఈ నెల 27న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అండర్–14 ఖో–ఖో పోటీలకు కొణిజర్ల మండలం అమ్మపాలెంలో గల జ్యోతీబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు నిహాన్, మణికంఠ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను.. బీసీ గురుకులాల ఆర్‌సీఓ బ్యూలారాణి, కన్వీనర్ జ్యోతిర్మయి, పాఠశాల ప్రిన్సిపల్ జాహెద, ఏటీపీ పద్మజ, పీఈటీ రవి, డిప్యూటీ వార్డెన్ నరసింహరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తక్షణమే రైతు భరోసా కల్పించాలి


మధిరలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


ముదిగొండ: ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- మధిర: రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మధిరలో ఆందోళన నిర్వహించారు.
- ముదిగొండ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ముదిగొండ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. తక్షణమే రైతు భరోసా రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. రూ.15వేల రైతు భరోసా పథకం కింద జమ చేయాలని అన్నారు. కార్యక్రమంలో రైతు బంధు మాజీ మండల కన్వీనర్ పోట్ల వెంకట ప్రసాదరావు, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్ పాల్గొన్నారు.
- బోనకల్: అధికారం కోసం ఎకరాకు 15వేలు రైతుబరోసా కింద ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పి రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ మధిర మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ బందం శ్రీనివాసరావు విమర్శించారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆద్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మోదుగు నాగేశ్వరరావు, నజీర్, పారా ప్రసాద్, కోటపర్తి రామారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.
- ఎర్రుపాలెం: రైతు భరోసా అందించాలని కోరుతూ.. మండలంలోని మీనవోలులో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.


ఎర్రుపాలెం: మీనవోలులో..


బోనకల్‌లో..

మహాసభలను జయప్రదం చేయండి


వైరా: ప్రచారం నిర్వహిస్తున్న ఐద్వా బాధ్యులు

వైరా: కొత్తగూడెంలో ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు గుడిమెట్ల రజిత కోరారు. ఆదివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్, హనుమాన్‌బజార్, బ్రహ్మణపల్లి, సోమవరం గ్రామాల్లో ఇంటింటికీ మహసభల వాల్ పోస్టర్లు వేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేయాలనే బీజేపీ కుట్రలకు వ్యతిరేకంగా ఐద్వా నిరంతరం పోరాడుతుందన్నారు. ఐద్వా సభ్యులు బత్తుల ప్రమీల, చావా కళావతి, బందేల అమృతమ్మ, తాటి కృష్ణమూర్తి, గుడిమెట్ల వెంకటరమణ, బండారి కరుణ, కుదురుపాక నాగమణి, యలదండి సుక్కుబాయి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కొణిజర్ల: ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు తాళ్లపల్లి విజయ పిలుపునిచ్చారు. ఆదివారం కొణిజర్లలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సభకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొలమాల సరోజిని, కురెల్లి సరోజిని, పుష్పరాణి, రమాదేవి, మధురమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విహంగాల అందం.. ఆహ్లాదం..

సత్తుపల్లిలో పలు రకాల పక్షుల సందడి


పక్షుల అందాలను కెమెరాలలో వీక్షిస్తున్న అటవీశాఖ అధికారులు



అందం ఆహ్లాదాన్ని అందిస్తూ విహంగాలు చేస్తున్న సందడి ప్రకృతి ప్రేమికులను మైమరపింపజేస్తోంది. సత్తుపల్లిలోని తామరచెరువు, కిష్టారం బీట్‌లలో అటవీశాఖ రేంజర్ పి.స్నేహలత, వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ దీపక్ రామాయన్ ఆధ్వర్యాన విహంగాలను వీక్షించారు. పలు రకాల పక్షులు ఈ ప్రాంతంలో చేస్తున్న సందడిని కెమెరాలలో బంధించారు. సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ పక్షుల కేరింతలను చూస్తుంటే ఇంత అందమైన పక్షులు ఈ ప్రాంతంలో ఉన్నాయా అని ఆశ్చర్యపోతాం. దాదాపు 36 రకాల పక్షులను గుర్తించారు. – సత్తుపల్లిటౌన్